సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం | 13 | జూన్ | 2025



సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

సూక్ష్మ పోషక లోపాల నివారణ. అధిక దిగుబడులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

సాగునీటి చెరువుల నుంచి మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. కొయ్యలగూడెం మండలంలోని ఊర చెరువుల నుంచి మట్టి తవ్వుతున్నారు. 8లో ▸



పెళ్లికి వెళ్లొస్తుండగా ప్రమాదం

కృత్తివెన్ను మండలం సంగమూడి సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొల్లుకు చెందిన కుంపట్ల రాంగోపాల్ మృతిచెందారు. 8లో ▸

విద్యామిత్రలో తడబడి

పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఇంకా పూర్తిస్థాయిలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) కిట్లు పాఠశాలలకు చేరుకోలేదు. స్కూల్స్ రీఓపెన్ నాటికి పూర్తిస్థాయిలో కిట్లు సిద్ధం చేయడంలో సంబంధిత యంత్రాంగం విఫలమైంది. బుక్స్ పూర్తిస్థాయిలో రాగా, షూలు 43 శాతం, యూనిఫాంలు 53 శాతం, బ్యాగులు 65 శాతం మాత్రమే పాఠశాలలకు చేరుకున్నాయి.

- బడులకు పూర్తిస్థాయిలో చేరని కిట్లు
- జిల్లాలో 93,458 మంది విద్యార్థులు
- 53 శాతం యూనిఫాం, 43 శాతం షూలు, 65 శాతం బ్యాగుల చేరిక
- గత ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచే నాటికి జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం



ఉండిలో విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి, భీమవరం: సర్వశిక్ష అభియాన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మూడు జతల యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, ఒక జత షూ, రెండు జతల సాక్స్‌లు, స్కూల్ బ్యాగ్, ప్రాథమిక, మాధ్యమిక విద్యార్థులకు అదనంగా డిక్షనరీలు చొప్పున ఒక్కో విద్యార్థికి రూ.2,300 విలువ చేసే కిట్లను ప్రభుత్వం అందజేస్తోంది. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 93,458 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం అవసరమైన మేర 6,51,038 నోట్ బుక్స్, 12,59,564 పాఠ్య పుస్తకాలు, 10,047 డిక్షనరీలు పాఠశాలలకు చేరుకున్నాయి. అలాగే 1 నుంచి 10వ తరగతి వరకు బాలురు, 1 నుంచి 5వ తరగతి వరకు బాలికలకు కలిపి 61,338 మందికి బెల్టులు వచ్చాయి. కాగా 93,458 మంది విద్యార్థులకు బ్యాగులు రావాల్సి ఉండగా గురువారం నాటికి 61,450 బ్యాగులు, అలాగే 50,761 మంది విద్యార్థులకు యూనిఫాంలు, 40 వేల వరకు షూలు మాత్రమే వచ్చాయి. ఇంకా 57 శాతం షూలు, 47 శాతం యూనిఫాంలు, 35 శాతం బ్యాగులు రావాల్సి ఉంది. రెండు మూడు రోజుల్లో అవి పాఠశాలలకు చేరుతాయని అధికారులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం వచ్చిన మేర ఎస్ఆర్‌కేవీఎం కిట్లు పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు.

నేరుగా పాఠశాలలకే పుస్తకాలు : పునర్విభజనలో భాగంగా కృష్ణా జిల్లా నుంచి ఏలూరులో విలీనమైన ఆగిరిపల్లి, చాట్రాయి, కై కలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, నూజివీడు, కుక్కునూరు మండలాలతో కలిపి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పుస్తకాల పంపిణీకి గతంలోనే విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 2024–25 విద్యాసంవత్సరానికి గాను పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో 1,818 పాఠశాలల్లోని 1,46,361 మంది విద్యార్థులకు 25,31,296 పాఠ్యపుస్తకాలకు అవసరంగా గుర్తించారు. గతంలో ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలోని తాడేపల్లిగూడెంలో స్టాక్ పాయింట్‌కు పుస్తకాలు చేరేవి. అక్కడి నుంచి ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేసేవారు. కాగా పుస్తక సరఫరా జాప్యాన్ని నివారించి మరింత సరళతరం చేస్తూ 7, 8, 9 తరగతుల పాఠ్యపుస్తకాలను ముద్రణ కేంద్రం నుంచి నేరుగా మండల స్టాక్ పాయింట్‌లు, అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

గత ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

టీడీపీ హయాంలో సగం విద్యాసంవత్సరం ముగిసినా పూర్తిస్థాయిలో ప్రభుత్వ బడులకు పాఠ్యపుస్తకాలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది. అప్పట్లో టెక్స్ట్ బుక్స్, యూనిఫాం, షూస్ మాత్రమే ఇచ్చేవారు. 2019 ఎన్నికల్లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్యకు పెద్దపీట వేశారు. విద్య వైపు వారిని మరింత ప్రోత్సహించే దిశగా జగనన్న విద్యాకానుక కిట్లు తెచ్చారు. గతంలో మాదిరి టెక్స్ట్ బుక్స్, యూనిఫాం, షూస్‌తో పాటు అదనంగా విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్, బెల్టు, బ్యాగు, ప్రాథమిక, మాధ్యమిక విద్యార్థులకు డిక్షనరీలు జోడించారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు తెరిచిన రోజునే పూర్తిస్థాయిలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేస్తూ వచ్చారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఏటా మాదిరిగానే గత విద్యా సంవత్సరంలోను పాఠశాలలు తెరిచిన రోజున టెక్స్ట్, నోట్ బుక్స్, యూనిఫాం, బెల్టులు, షూలు తదితర సామగ్రి పంపిణీకి చర్యలు తీసుకున్నారు.

ప్రచార ఆర్భాటం.. అందని యూనిఫాం



భీమవరంలో విద్యార్థులకు బ్యాగ్, పుస్తకాలు మాత్రమే అందిస్తున్న దృశ్యం

భీమవరం: పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు విద్యామిత్ర పథకం ద్వారా పుస్తకాలతో పాటు యూనిఫాం, షూస్, బెల్ట్ వంటి విద్యా సామగ్రితో కిట్స్ పంపిణీ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం చేసినా అమలులో తుస్సు మనిపించింది. పలు ప్రాంతాల్లో పాఠశాలల వద్ద కూటమి నేతలు ఆర్భాటం చేశారు. స్టూడెంట్ కిట్లు అందించారు. అయితే స్టూడెంట్ కిట్‌లో కేవలం పాఠ్య, నోట్ పుస్తకాలు మినహా మిగిలిన విద్యా సామగ్రి జాడ లేదు. యూనిఫాం పాఠశాలలకు సరఫరా కాకపోవడంతో మొక్కుబడిగా బుక్స్, బ్యాగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. జిల్లాలోని 20 మండలాలకు గాను కేవలం కాళ్ల, ఆకివీడు, అత్తిలి, నరసాపురం మండలాలకు మాత్రమే యూనిఫాం సరఫరా చేయగా మిగిలిన 16 మండలాలకు అందాల్సి ఉంది.

న్యూస్‌రీల్

బీఎల్‌ఓ బాలాజీకి అరుదైన అవకాశం



ఎన్నికల కమిషనర్ జోషీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీఎల్‌ఓ వేణుగోపాల్

నరసాపురం రూరల్: జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ), బూత్ లెవెల్ సూపర్‌వైజర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. దేశ ఎన్నికల కమిషనర్ వివేక్‌జోషికి పుష్పగుచ్ఛం ఇచ్చే అవకాశాన్ని దేశవ్యాప్తంగా బీఎల్‌ఓల తరపున నరసాపురం మండలం రాజుల్లంకకు చెందిన కటకంశెట్టి వేణుగోపాల్ (బాలాజీ)కి దక్కింది. బీఎల్‌ఓ బాలాజీ నరసాపురం మండలం రాజుల్లంక, సారవ గ్రామాల వీఆర్వోగా పనిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి బీఎల్‌ఓలు హాజరుకాగా తనకు అరుదైన అవకాశం దక్కిందని బాలాజీ ఫోన్‌లో తెలిపారు. బాలాజీని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, సహచర బీఎల్‌ఓలు అభినందించారు.

కూటమి నేతల ఒత్తిళ్లు తాళలేక రాజీనామా

పోలవరం రూరల్: మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నం.3లో టీచర్‌గా పనిచేస్తున్న కుంజా చిన వెంకటలక్ష్మి తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు గురువారం ప్రకటనలో తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేకే తాను రాజీనామాకు సిద్ధపడినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కొయ్యలగూడెంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో రాజీనామా లేఖను అందజేశానని తెలిపారు. 25 ఏళ్లుగా తాను అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నానని, తన భర్త ప్రతిపక్ష పార్టీలో కీలక నేతగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. దీంతో తనను కూటమి నాయకులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. అధికార, రాజకీయ పరంగా వేధింపుల దృష్ట్యా రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు.

యథేచ్ఛగా పుస్తకాల వ్యాపారం

జంగారెడ్డిగూడెం: చదువును అడ్డం పెట్టుకుని విద్యార్థుల తల్లితండ్రులను కార్పొరేట్ విద్యా సంస్థలు దోచుకుంటున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని నారాయణ విద్యాసంస్థలో పుస్తకాల విక్రయాన్ని గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకుని ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో–2 జి.రాములు పాఠశాలను తనిఖీ చేసి బుక్‌స్టోర్‌ను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.100కు దొరికే పుస్తకాలు సైతం రూ.300 వరకు విక్రయిస్తున్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్లు పుస్తకాలు తమ వద్దే కొనుగోలు చేయాలని తల్లితండ్రులపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఎస్సీ పరీక్షలకు 31 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలోని మూడు కేంద్రాల్లో గురువారం డీఎస్సీ పరీక్షలు నిర్వహించగా 95.74 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.నారాయణ తెలిపారు. ఉదయం 366 మందికి 348 మంది హాజరుకాగా 18 మంది, మధ్యాహ్నం పరీక్షకు 361 మందికి 348 మంది హాజరుకాగా 13 మంది మొత్తంగా 31 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. స్పెషల్ స్క్వాడ్ బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరులో గురువారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 714 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నగరంలోని సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 160 మంది, మధ్యాహ్నం 180 మందికి 173 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 200 మందికి 191 మంది, మధ్యాహ్నం 200 మందికి 190 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీలో 50.24 శాతం ఉత్తీర్ణత

భీమవరం: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో విద్యార్థులు 50.24 శాతం ఉత్తీర్ణత సాధించారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. 4,570 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,296 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో 2,879 బాలురకు 1,338 మంది , 1,691 మంది బాలికలకు 958 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 18 వరకు అవకాశం ఉందన్నారు. రీకౌంటింగ్‌కు ఒక సబ్జెక్ట్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు ఒక సబ్జెక్ట్‌కు రూ.1,000 చెల్లించాలని తెలిపారు.

15న అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం



భీమవరంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

భీమవరం/ఆకివీడు: అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు నష్టపోయిన ప్రజలు, ఏజెంట్లకు సత్వర న్యాయాన్ని తక్షణం అందించాలని, అగ్రిగోల్డ్ బాధితుల కేసులను వాదించడానికి ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. గురువారం భీమవరం, ఆకివీడులో ఆయన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. ఈనెల 15న తణుకులో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.15 వేలు, రూ.20 వేలలోపు డిపాజిట్‌దారులు 10 లక్షల మందికి రూ.900 కోట్లను పంపిణీ చేసిందన్నారు. మరో 14 లక్షల మంది బాధితులకు రూ.3,900 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. తమ సంఘం చేసిన డిమాండ్లను టీడీపీ కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాయని, అయినా ఇప్పటికీ అమలుచేయకపోవడం దారుణమన్నారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో పలు పోరాటాలు చేసినా ఫలితంగా కంటి తుడుపుగానే ఉందన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకుని చివరి బాధితుడి వరకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ భీమవరం బ్రాంచ్ గౌరవాధ్యక్షుడు ఎం.సీతారాంప్రసాద్, బ్రాంచ్ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, బాధిత సంఘం నాయకులు ఇంటి వెంకట సత్యనారాయణ, కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా



తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంజనీరింగ్ విభాగంలోని అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే తాము ఉద్యమాలకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగపు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. నాయకులు ఎం.సతీష్ కుమార్, ఎ.కుమార్ మాట్లాడుతూ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు వినతులు ఇచ్చామని, తమ సంఘాన్ని చర్చలకు పిలిచినా సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలమైనట్టు ఆందోళన వ్యక్తం చేశారు. హెడ్‌వాటర్ వర్క్స్, వాటర్ సప్లయ్, ఆఫీస్ ఎలక్ట్రీషియన్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ సిబ్బంది, ఆపరేటర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణికి కాలం చెల్లిన మందులు

ఏలూరు జీజీహెచ్‌లో దారుణం



గర్భిణికి ఇచ్చిన కాలం చెల్లిన మందులు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో వైద్య సేవలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనేందుకు తాజా ఘటన నిదర్శనం. ఏకంగా మాతా శిశు విభాగంలో మహిళల ప్రాణాలతో చెలగాటమాడుతూ కాలం చెల్లిన మందులు ఇస్తూ తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఏలూరు జీజీహెచ్‌లో పర్యవేక్షణ లేకపోవటం, పూర్తిస్థాయిలో సూపరింటెండెంట్ పోస్టును భర్తీ చేయకపోవటం, ఇన్‌చార్జులతో నెట్టుకురావడం, వైద్యులు, సిబ్బంది అలసత్వానికి రోగులు బలి అయ్యే ప్రమాదం ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరు రూరల్ పాలగూడెం ప్రాంతానికి చెందిన భవానీ అనే గర్భిణి ఈనెల 11న జీజీహెచ్‌కు రాగా వైద్యులు పరీక్షించి ఆమెకు ఓపీ చీటీలో మందులు రాసిచ్చారు. చీటీ ద్వారా కౌంటర్ నుంచి ఆమె మందులు తీసుకోగా వాటిలో డాక్సిలెమిన్ సక్సినేట్ (నిద్రలేమి) అనే మాత్రలు ఉన్నాయి. వీటి కాల పరిమితి 2025 మే నెల వరకే ఉన్నా వైద్య సిబ్బంది పట్టించుకోకుండా గర్భిణికి ఇచ్చారు. అయితే వీటి ఎక్స్‌పైరీ తేదీని చూసిన భవానీ కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఎక్స్‌పైరీ చూడకుండా మాత్రలు వేసుకుంటే గర్భిణి, ఆమె కడుపులో బిడ్డకు ప్రాణాపాయ పరిస్థితి వచ్చేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణుల ఆరోగ్యంపై ఇంతటి నిర్లక్ష్య ధోరణా అంటూ మండిపడ్డారు. దీనిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్‌ను వివరణ కోరగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామనీ, ఎప్పటికప్పుడు కాలం చెల్లిన మందులను పక్కకు తీసివేస్తామని, ఎక్కడో పొరబాటు జరిగి ఉంటుందని తెలిపారు. విచారణ చేస్తామనీ, బాధ్యులపై చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

కూటమి అరాచకాలను ఎండగడతాం

వైఎస్సార్‌సీపీ భీమవరం సమన్వయకర్త వెంకట్రాయుడు



మండలి చైర్మన్ మోషేన్‌రాజును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకట్రాయుడు

భీమవరం: కూటమి ప్రభుత్వ అరాచకాలు, దౌర్జన్యాలను ఎండగట్టి, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేలా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటామని పార్టీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు అన్నారు. గురువారం మండలంలోని రాయలం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన ఒక్క హామీనీ పూర్తిస్థాయిలో అమలుచేయలేదన్నారు. ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో లేకున్నా మద్యం, పేకాట క్లబ్‌లతో రాష్ట్రం కళకళలాడుతోందని ఆరోపించారు. కూటమి ఏడాది పాలనలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై బురద జల్లడం మినహా ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో విద్యార్థులకు ఇచ్చే సొమ్ములో భారీగా కోత విధించారని, 20 లక్షల మంది పిల్లలకు పథకం దక్కకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు అంటూ ప్రచారం చేసి రూ.2 వేలు కోత ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. క్రిస్టియన్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడిది జాన్సన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, యువజన వింగ్ జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి నిత్యం ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గాదిరాజు రామరాజు, కోడే యుగంధర్, పాలవెల్లి మంగ, గంటా సుందరకుమార్, అల్లూరి రవిరాజు, చికిలే మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు కృతజ్ఞతలు

భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కో–ఆర్డినేటర్‌గా నియమించడానికి సహకరించినందుకు పుష్పగుచ్ఛం అందించి మోషేన్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, చిలుకూరి నర్సింహరాజు, కట్టా రవిశంకర్ తదితరులు ఉన్నారు.

పొగబారిన ఆశలు

రైతుల్లో గుబులు

- మందకొడిగా పొగాకు మార్కెట్
- పెరగని ధరలు.. కర్షకుల ఆవేదన
- లోగ్రేడ్ రకాలకు వేలంలో నో చాన్స్
- 60 రోజులు దాటినా దక్కని గిట్టుబాటు ధర



బుట్టాయగూడెం: ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలకు ఆశించిన ధరలు లేక రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి రైతులు నష్టాలు మూటగట్టుకోగా.. ఇదే పరిస్థితి పొగాకు రైతులకూ ఎదురవుతోంది. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టుబడులకు రెట్టింపు ఆదాయాన్ని చూసిన రైతులు ఈ ఏడాది కనీసం గిట్టుబాటు ధర కూడా లేక దిక్కులు చూస్తున్నారు. జిల్లాలో పొగాకు కొనుగోళ్ల వేలం ప్రారంభించి దాదాపు 63 రోజులు కావస్తున్నా ఇప్పటికీ పొగాకు మార్కెట్ పుంజుకోలేదు. మందకొడిగా మార్కెట్ ఉండటంతో గిట్టుబాటు ధర లేక రైతులు నిరాశతో ఉన్నారు. పొగాకు ట్రేడర్లు నాణ్యతకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ఆసక్తి చూపకపోవడంతో ఈ రకం బేళ్లు రైతులు ఇళ్ల వద్దే ఉండిపోతున్నాయి.

పరిమితి మించి సాగు

ప్రస్తుత (2024–25) సీజన్‌లో పరిధికి మించి రైతులు పొగాకు పంటలను సాగు చేసినట్టు బోర్డు అధికారులు చెబుతున్నారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలోని 29 మిలియన్ల పంటకు బోర్డు అనుమతి ఇచ్చి పొగాకు బేరన్లను రిజిస్ట్రేషన్ చేయగా అంతకు మించి పొగాకు సాగు చేసినట్టు చెబుతున్నారు. పరిమితికి మించి అధిక విస్తీర్ణంలో సాగు చేయవద్దని అధికారులు, ట్రేడర్లు, రైతు సంఘాల ప్రతినిధులు చెప్పినా అనుమతికి మించి రైతులు సాగు చేశారు. అయితే ఈ ఏడాది జింబాబ్వే, బ్రెజిల్‌లో పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని పంటలు వేయాలని అధికారులు సూచించినా రైతులు అధికంగా పంటలు వేసినట్టు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 40 వేల హెక్టార్లలో పొగాకు సాగుచేసినట్టు సమాచారం. మార్కెట్ అవసరాలకు మించి పంట ఉత్పత్తి కావడంతో మార్కెట్ సంక్షోభంలో పడినట్టు చెబుతున్నారు. గతేడాది పొగాకుకు ఊహించని రీతిలో ధరలు రాగా.. ఇదే ఆశతో ఈ ఏడాది రైతులు భూమి కౌలు, పంటలకు ఖర్చులు అధికంగా వెచ్చించారు.

గత ప్రభుత్వంలో రైతులకు అండగా..

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014లో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జిల్లాలో పర్యటించిన సమయంలో పొగాకు పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోతే గుంటూరు బోర్డు వద్ద ధర్నా చేస్తానని హెచ్చరించారు. ఆ సమయంలో కిలో రూ.10 నుంచి రూ.17 వరకూ ధర పెరిగి రైతులకు మేలు జరిగింది. అలాగే 2020లో పొగాకు మార్కెట్ సంక్షోభంలో పడి లోగ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ముందుకు రాకపోగా విషయం తెలిసిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్ ద్వారా లోగ్రేడ్ పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయించారు. ఇలా సుమారు 16 మిలియన్ కిలోల పొగాకును రైతుల నుంచి సేకరించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని పొగాకు రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది కౌలు, పంటల ఖర్చులు అధికంగా పెరిగాయని ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఇస్తున్న ధర తమకే మాత్రం సరిపోదని అంటున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పుల పాలవుతామని ఆవేదన చెందుతున్నారు.

రైతుల పరిస్థితి దయనీయం



పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కంపెనీలు పూర్తిస్థాయిలో వేలంలో పాల్గొనడం లేదు. దీంతో కొనుగోలు ధరకు పోటీలేదు. రాబోయే రోజుల్లో ధర పెరుగుతుందని ఆశిస్తున్నాం. సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెరగడంతో మార్కెట్ సంక్షోభంలో ఉన్నట్టు భావిస్తున్నాం.

– అల్లూరి రత్నాజీరావు, రైతు, రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రస్తుతం పొగాకు మార్కెట్ పరిస్థితి అర్థం కావడం లేదు. పంట పెట్టుబడి ఖర్చులు కూడా వస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. పొగాకు కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ట్రేడర్లు, బోర్డు అధికారులు చర్చించి గిట్టుబాటు ధర కల్పించి పొగాకు రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సయ్యద్ బాజీ, రైతు, అచ్చియ్యపాలెం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

స్కూల్‌కి వచ్చిన కొద్దిసేపటికే..

హెచ్‌ఎం ఆకస్మిక మృతి


హెచ్‌ఎం సురేష్ (ఫైల్)

పెదవేగి: పాఠశాలకు వచ్చిన కొద్దిసేపటికే ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందారు. వివరాల ప్రకారం పెదవేగి మండలం కూచింపూడి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ గురువారం పాఠశాలకు వచ్చిన అనంతరం ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో పాఠశాల సిబ్బంది ఆయన్ను ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఉపాధ్యాయులు చెప్పారు.

క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నం

యువకుడిని కాపాడిన పోలీసులు

భీమవరం: క్షణికావేశంలో యువకుడు ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు కాపాడిన ఉదంతమిది. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గునుపూడికి చెందిన అంజి (22) మనస్తాపానికి గురై గురువారం రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ ఎం.నాగరాజు వెంటనే స్పందించి హెడ్‌కానిస్టేబుల్ శేషావతారం, కానిస్టేబుల్ జయరాజులను పంపించడంతో వారు తక్షణం ఘటనాస్థలికి చేరి యువకుడ్ని కాపాడి బంధువులకు అప్పగించారు. యువకుడి కుటుంబసభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రి మృతి


దార్లంక మునేశ్వర రావు మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన కొత్తూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి. నవాబుపాలెం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ దార్లంక మునేశ్వరరావు (35) కొత్తూరు గ్రామంలో ఇంటి నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మునేశ్వరరావు తల్లి దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్సై జేవీఎన్ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల చెరువులో రేకు పడవ తిరగబడి..


జైస్వాల్ మృతదేహం

దెందులూరు: చేపల చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం తండాకు చెందిన జైస్వాల్ జగదీష్ (41) ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామంలో చేపల చెరువులపై కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. గురువారం చెరువులో మేత పెట్టడానికి వెళ్లి రేకు పడవ తిరగబడి చెరువులో మునిగి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

- రసాయన ఎరువులతో భూముల్లో పోషకాల లోపం
- దిగుబడులు తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన
- సేంద్రియ సాగు మేలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు


మెట్ట ప్రాంతంలో రైతులు పండిస్తున్న వేరుశనగ పంట (ఫైల్)


సబ్ డివిజన్‌లో వ్యవసాయ బోర్ల కింద రైతులు వేసిన నారుమళ్లు

చింతలపూడి : నేడు రైతులు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను పండించడానికి విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా భూముల్లో ద్వితీయ సూక్ష్మ పోషక లోపం తలెత్తి దిగుబడులు క్షీణిస్తున్నాయి. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్ సూచిస్తున్నారు. ప్రధానంగా వేరుశనగ పంటలో జిప్సం వినియోగించడం వలన మంచి ఫలితాలు వస్తాయంటున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 35,542 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుంటారు. ఇవి కాక 340 ఎకరాల్లో మొక్కజొన్న, 157 ఎకరాల్లో వేరుశనగ పంటలు పండిస్తారు. రబీ సీజన్‌లో సుమారు 1,500 హెక్టార్లలో వరి, 18 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 2,500 హెక్టార్లలో వేరుశనగ పంటలను రైతులు సాగు చేస్తుంటారు.

ఎరువుగా జిప్సం

బీడు, చౌడు భూముల్లో నీరు సరిగా ఇంకదు. గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. భూమి భౌతిక లక్షణాలు క్షీణించి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మొక్కల వేర్లు సరిగా వృద్ధి చెందక మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగంవల్ల నేల గుల్లబారి భూమిలో నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వద్ధి చెందుతాయి. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. జిప్సంలో 24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉంటుంది. ముఖ్యంగా నూనె గింజలు, పప్పు ధాన్యాల వంటి పంటల్లో గంధకం ఆవశ్యకత అధికంగా ఉంటుంది. కాల్షియం మొక్కల్లోని జీవకణాల అంచులు గట్టిగా ఉండటానికి, కణ విభజనకు, వేర్ల అభివద్ధికి గింజకట్టడానికి అవసరమవుతుంది. దీని వల్ల మొక్కలకు చీడపీడలను ఎదుర్కొనే శక్తి సమకూరుతుంది.

జిప్సంతో వేరుశనగకు బలం

వేరుశనగ పంటలో జిప్సంను పూత దశలో వేసుకుని భూముల్లో కలియ బెట్టడం వల్ల వేరుశనగ ఊడలు జిప్సంలోని కాల్షియం, గంధకాన్ని తీసుకుని అధిక దిగుబడులు ఇస్తాయి. కాయలు గట్టిగా ఉండి కాయ నిండా పప్పు వృద్ధి చెంది గింజలు అధిక నూనె శాతం కలిగి ఉంటాయి. ఫలితంగా కాయలు అధిక బరువు కలిగి మంచి ధర పలుకుతాయి. కాబట్టి పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున జిప్సంను భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా వేసుకోవాలి.

అదుపు తప్పి లారీ బోల్తా.. డ్రైవర్ మృతి


పాలవాగు వద్ద బోల్తా పడిన లారీ


లారీ డ్రైవర్ మృతదేహం

కుక్కునూరు: కుక్కునూరు–బూర్గంపాడు ఆర్‌అండ్‌బీ రహదారిపై గురువారం లారీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. కుక్కునూరు ఎస్సై రామక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి రాయపూర్‌కు కొత్త క్యాట్ డోజర్ వాహనాన్ని తీసుకెళ్తున్న లారీ కుక్కునూరు మండలంలోని పాలవాగు మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ కేబిన్ తిరగబడడంతో కేబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ చరణ్‌ప్రీత్‌సింగ్ (50) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ స్వస్థలం రాయపూర్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించామని, ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

పెళ్లికి వెళ్లొస్తుండగా ప్రమాదం

- భర్త మృతి, భార్య పరిస్థితి విషమం, కుమారుడికి తీవ్ర గాయాలు
- స్వల్ప గాయాలతో బయటపడిన కుమార్తె
- ఆ కుటుంబంలో పెను విషాదం నింపిన ప్రమాదం


ప్రమాదంలో మృతి చెందిన కుంపట్ల రాంగోపాల్ (ఫైల్)


సంగమూడి వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు

కృత్తివెన్ను, యలమంచిలి: అప్పటి వరకు ఎంతో సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ సరదాగా సాగుతున్న వారి ప్రయాణంలో లారీ రూపంలో మృత్యువు దూసుకువచ్చి కుటుంబ యజమానిని కబళించివేసింది. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సంగమూడి సమీపంలో 216 జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంపట్ల రాంగోపాల్ (41) ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన రాంగోపాల్ తన భార్య రీతూ, కుమారుడు రాము, కుమార్తె ప్రణవితో కలసి హైదరాబాద్‌లో బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి తమ కారులో తిరిగి పాలకొల్లుకు బయలుదేరారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో సంగమూడి చినగట్టు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న లారీ, కారు బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో రాంగోపాల్ అక్కడికక్కడే మరణించగా, భార్య రీతూ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. కుమారుడికి సైతం తలకు బలమైన గాయాలుకాగా, కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడింది. కారులో ఇరుక్కుపోయిన రాంగోపాల్ మృతదేహాన్ని బయటకు తీయడానికి పోలీసులు, స్థానికులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రాంగోపాల్ పాలకొల్లులో రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి అధ్యక్షుడిగా పనిచేశారని, అందరితో కలివిడిగా ఉండే కుటుంబం ఒక్కసారిగా ప్రమాదంలో ఇలా ఛిద్రమైపోవడం ఎంతో విషాదాన్ని మిగిల్చిందని వారి బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. ఈ ఘటనపై బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా


కన్నాయిగూడెం ఊర చెరువు నుంచి జేసీబీలతో మట్టిని తవ్వుతున్న దృశ్యం


కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు రాజు చెరువు నుంచి మట్టి రవాణా చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సాగునీటి చెరువుల నుంచి మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. గురువారం దిప్పకాయలపాడు రాజు చెరువు, కన్నాయిగూడెం ఊర చెరువుల నుంచి జేసీబీలను పెట్టి అక్రమార్కులు ట్రక్కుల్లో మట్టిని తరలించారు. మట్టి అక్రమ రవాణాకు ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా సహకరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులో ఒకరోజు జేసీబీ పెట్టి మట్టి తోలకాలు నిర్వహించుకోవడానికి రూ.పదివేలు ఇస్తున్నామంటూ మట్టి అక్రమ రవాణాదారులు బాహాటంగా చెబుతుండడం విశేషం. వ్యవసాయ భూములకు మాత్రం మట్టి రవాణా చేస్తే అడ్డుకుంటున్నారని, కమర్షియల్ అవసరాలకు అనధికారికంగా అనుమతులు ఇస్తున్నారని దిప్పకాయలపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఇమ్మని శ్రీనివాస్ ఆరోపించారు. వందలాది ట్రక్కుల్లో మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని, రాష్ట్ర సరిహద్దుల వరకు ఏజెన్సీ మెట్ట ప్రాంతంలోని సాగునీటి చెరువుల మట్టి రవాణా జరుగుతోందన్నారు. రాజవరం, యర్రంపేట, కన్నాపురం, గవరవరం, పులివాగు సమీపాల్లోని సాగునీరు చెరువుల నుంచి భారీగా ట్రక్కుల్లో మట్టి రవాణా అవుతుందని కొన్నిసార్లు అక్రమార్కులు వాగ్వాదానికి దిగి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో యంత్రాల హడావిడికి పశువులు కట్లు తెంపుకుని పారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి


విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే మృతిచెందిన మధిరి నవీన్, ఇన్‌సెట్‌లో నవీన్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది. విద్యుత్ స్తంభాలపై మరమ్మతు పనులను విద్యుత్ సిబ్బంది చేపట్టాల్సి ఉంది. కానీ విద్యుత్ శాఖతో సంబంధం లేని వ్యక్తిని విద్యుత్ స్తంభంపైకి ఎక్కించి మరమ్మతు పనులు చేయిస్తుండగా అతడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా భీమవరప్పాడుకు చెందిన కొమ్మి మన్మథశేఖర్ అనే కాంట్రాక్టర్ వద్ద కృష్ణాజిల్లా చంద్రాల గ్రామానికి చెందిన మధిరి నవీన్ (26) పనిచేస్తున్నాడు. ప్రస్తుతం కాంట్రాక్టర్ మండలంలో 11కేవీతో పాటు పలు విద్యుత్ లైన్‌ల పనులు నిర్వహిస్తున్నాడు. గురువారం మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో పనుల నిమిత్తం ఇద్దరు యువకులతో కలిసి నవీన్ వెళ్లాడు. పనులు ముగిసిన అనంతరం తిరిగి వస్తున్న సమయంలో లైన్‌మెన్ సురేష్ లైన్ మరమ్మతు పని ఉందని చెప్పి నవీన్‌ను రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కించాడు. మరమ్మతు పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ ప్రవహించడంతో నవీన్ విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. సమాచారం అందుకున్న డీఈ సుబ్బారావు, ఎస్సై జబీర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించి మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి డీఈ సుబ్బారావు మాట్లాడుతూ మరమ్మతుల నిమిత్తం ఎల్‌సీ తీసుకున్నారని, సమీప ఇళ్లల్లోని ఇండక్షన్ సప్‌లై రావడంతో ప్రమాదం జరిగినట్లుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు. కాగా, లైన్‌మన్ చేయాల్సిన పనిని విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసే వారితో చేయించడంతో ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి


పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెనుమంట్ర: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సాక్షి కార్యాలయాలపై విధ్వంసం సృష్టించి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తున్న అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని పెనుమంట్ర మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి నాయకత్వంలో పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా గౌరీ సుభాషిణి మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా ఏలూరు జిల్లాలో ఎస్‌ఆర్ పేట సాక్షి ప్రాంతీయ కార్యాలయం వద్ద దెందులూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ గూండాలు భయానక వాతావరణం సృష్టించి కంప్యూటర్‌లను ధ్వంసం చేయడం, జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. ఇటువంటి వ్యక్తులను గుర్తించి పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈది అనితా ప్రవీణ్, ఎంపీటీసీ పి నరశింహమూర్తి, పలివెల ఆశాలత, గెడ్డం ఈశ్వరుడు, పెనుగొండ లక్ష్మి, కర్రి లక్ష్మి, గండి రామారావు, సర్పంచ్‌లు గూడూరి దేవేంద్రుడు, బుర్రా రవికుమార్, మామిడిశెట్టి ధనలక్ష్మి, ఉప సర్పంచ్‌లు కర్రి వేణుబాబు, కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్ కోర్సులో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు కే రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆపై ఉత్తీర్ణులై 18 నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94934 82414 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తమిళనాడు డీసీపీగా కామవరపుకోట వాసి

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు తనయుడు ప్రవీణ్ గౌతమ్ తమిళనాడులోని తిరుపూర్ పట్టణానికి డీసీపీగా ఎంపికయ్యారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్ గౌతమ్ 2023 నుంచి తమిళనాడు రాష్ట్రంలో కన్యాకుమారి అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ, డీసీపీగా ప్రమోషన్ పొందారని విజయరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



దెందులూరు: దెందులూరు జాతీయ రహదారి కొవ్వలి వంతెన సమీపంలో గురువారం ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పెదవేగి సీఐ రాజశేఖర్ దెందులూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు రోడ్డు పక్కనే పడి ఉండడంతో అనారోగ్య కారణాలతో మృతి చెందాడా.. లేక వడదెబ్బకు మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

వీరవాసరం: వీరవాసరం–మత్స్యపురి ఆర్‌అండ్‌బీ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై యువకుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తోకలపూడి గ్రామానికి చెందిన జుత్తిగ శ్రీలక్ష్మి సుబ్రహ్మణ్యంల కుమారుడు పూర్ణగణేష్ (16) ఈనెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 12వ తేదీ ఉదయం 8 గంటలకు వీరవాసరం - మత్స్యపురి రహదారిలోని బొబ్బనపల్లి సమీపంలో రక్తపు గాయాలతో తన కుమారుడు పడి ఉన్నట్లు సమాచారం రావడంతో హుటాహుటీన అక్కడకు వెళ్లి చూడగా తలకు తీవ్ర గాయమై మృతి చెంది ఉన్నాడని శ్రీలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల ఈ రహదారిలో మట్టి ట్రాక్టర్లు ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో ఎస్సై రాజకుమార్ డ్రైవర్లను విచారణ చేస్తున్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలి


భీమవరం కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

భీమవరం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాలను విడనాడి, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. గురువారం భీమవరం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ నాయకులు ఆందోళన నిర్వహించి డీఆర్‌ఓ ఎం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది ఆత్మ బలిదానంతో ఏర్పడిందని లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తోందన్నారు. రూ.మూడు లక్షల కోట్ల ఆస్తులు కలిగిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించాలనే అజెండాగా పెట్టుకుందని విమర్శించారు. ప్రైవేట్ ఉక్కు పరిశ్రమలకు గనులు కేటాయించిన కేంద్రం విశాఖ ఉక్కును పట్టించుకోకుండా గాలికొదిలేసి నష్టాల సాకుతో విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టిందని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టీడీపీ, జనసేన పార్టీలు ప్రస్తుతం నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఎం. సీతారాంప్రసాద్, ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

మాస్క్‌తో భద్రం



మాస్క్‌లతో శ్రీవారి దర్శనానికి వెళుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: కోవిడ్ కేసులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మాస్క్‌తోనే భద్రం అని కొందరు అంటున్నారు. ఈ క్రమంలో దేవాలయాలను సందర్శించే కొందరు భక్తులు మాస్క్‌లను విధిగా వాడుతున్నారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి వస్తున్న పలువురు భక్తులు మాస్క్‌లను వినియోగిస్తున్నారు. కాగా కోవిడ్ ప్రభావం లేదని కొందరు భక్తులు తేలిగ్గా తీసుకుంటుంటే, జాగ్రత్తలు పాటించడం వల్ల ఒక్క కోవిడ్ నుంచే కాకుండా, ఇతర వైరస్‌ల బారి నుంచి రక్షణ పొందొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాగన్లపై బరకాలు వేయరా?


బరకాలు కప్పకుండా వ్యాగన్లలో బొగ్గు రవాణా చేస్తున్న రైల్వే శాఖ

ఆకివీడు: వ్యాగన్ల ద్వారా ఎగుమతులు చేస్తున్న వస్తువులపై బరకాలు కప్పడం ద్వారా ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే రైల్వే శాఖ ఇటీవల తరచూ బొగ్గును వ్యాగన్ల ద్వారా విశాఖపట్నం వైపు, విజయవాడ వైపు రవాణా చేస్తున్నాయి. బొగ్గు పై భాగంలో బరకాలు కప్పకుండా రవాణా చేయడంతో వేగానికి బొగ్గు ముక్కలు, రజను, దుమ్ము ఎగిరిపడి ప్లాట్ ఫారాలపై ఉన్న ప్రయాణికుల మీద, రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ప్రజలపై, రైల్వే గేట్ల వద్ద వేచి చూస్తున్న వాహన చోదకులపై పడి గాయాల పాలు చేస్తున్నాయి. కంట్లో బొగ్గు నలుసులు పడి తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. కొన్ని చోట్ల ప్లాట్‌ఫారమ్‌పై బొగ్గుముక్కలు కన్పిస్తున్నాయి. రైల్వే ఉన్నతాధికారులు వ్యాగన్లలో రవాణా చేసే సరుకులపై టార్పాలిన్‌లు కప్పే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కత్తులతో దాడి కేసులో ఆరుగురి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో పట్టపగలు రెండు వర్గాలు కత్తులు, రాళ్లతో దాడులు చేసుకున్న ఘటన నగరంలో సంచలనంగా మారింది. ఇరువర్గాలు గాయాలపాలై ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలపై ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై అప్పారావు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి ఒక కేసులో ఇద్దరినీ, మరో కేసులో నలుగురిని అరెస్ట్ చేశారు. ఏలూరు ఫిరంగుల దిబ్బ ప్రాంతానికి చెందిన కగ్గా వెంకటేశ్వరరావుకు మరో వర్గానికి చెందిన ఇబ్బా వెంకటేశ్వరరావుకు మధ్య ఇంటి సరిహద్దు తగాదాలు ఉన్నాయి. ఈనెల 10న ఇంటివద్ద ఇరు వర్గాలు గొడవలు పడగా... మరోసారి అదేరోజు ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో బాహాబాహీ తలపడుతూ దాడులు చేసుకున్నారు. రెండు వర్గాల ఫిర్యాదుల మేరకు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. కగ్గా వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై ఇబ్బా నాగరాజు, వరప్రసాద్‌ను, మరో వర్గానికి చెందిన దారం దావీదురాజు ఫిర్యాదుపై యడవల్లి బాలాజీ, కర్నాటి వెంకట్, నక్కా వెంకటరమణ, యడవల్లి నాగలక్ష్మిని ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరుగురిని న్యాయ స్థానంలో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో వారిని ఏలూరు జిల్లా జైలుకు తరలించారు.

ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా షబ్నం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎస్‌కే షబ్నం నియమితులయ్యారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతి కల్పించి ఏలూరు ప్రజా రవాణా అధికారిగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఏలూరులో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎన్‌వీఆర్ వరప్రసాద్ పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారిగా పూర్తి స్థాయి విధులు నిర్వహిస్తారు. షబ్నం రెండు రోజుల్లో ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆధ్వ ర్యంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చనున్నట్లు నిర్వాహకులు ఎల్ఎస్‌వీ నాగేశ్వర రావు, వీవీఎస్ లక్ష్మీనారాయణ, చిన్నం జగదీష్, బి.మహాలక్ష్మిలు తెలిపారు. నిడద వోలు రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వారిచే లయన్ పదంకుమార్ గుప్తా ఆర్థిక సహ కారంతో వైద్య శిబిరం జరుగుతుందని, ఉచిత కంటి ఆపరేషన్లు, పేదలకు ఉచితంగా కళ్ల జోడ్లు అందించనున్నట్లు వెల్లడించారు. శిబిరం ను తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి బస్‌పాస్ సేవల పునరుద్ధరణ

తణుకు అర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం బస్సు పాస్‌లు, ఐడెంటీ కార్డుల కలర్ కోడ్ మార్పు, సాఫ్ట్‌వేర్ అప్డేట్ వంటి ప్రక్రియలు పూర్తిచేసి శుక్రవారం నుంచి సేవలు పునరిద్ధరించామని తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో బస్సు పాస్ అప్లికేషన్ పూర్తి చేయలేనివారు డిపోలోని కౌం టర్ వద్ద అప్లికేషన్ పూర్తి చేయించుకోవచ్చని, అప్లికేషన్ పూర్తి చేసినందుకు, బస్సు పాస్ లామినేషన్‌కు ఎటువంటి అదనపు రుసు ములు చెల్లించనవసరం లేదని చెప్పారు. అదనపు రుసుము డిమాండ్ చేస్తే డిపో మేనేజర్ 99592 25484, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ 63042 10265 నంబర్లలో ఫిర్యాదు చేయ వచ్చని వివరించారు. విద్యార్థులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకుని సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



సమావేశంలో సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

పెంటపాడు: రాష్ట్రంలో రజకులు ఎదుర్కొం టున్న సమస్యలకు చైతన్య సంస్థ కొండంత అండగా ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్ పేర్కొన్నారు. అలంపురం జయగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆ సం స్థ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాకినాడ రామారావు ఆదేశాల మేరకు గూడెం నియోజ కవర్గ కమిటీ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా బోగెల్లి రాంబాబు, కార్యదర్శిగా కడకట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జె. కొం డయ్య, జిల్లా బీసీ వెల్ఫేర్ జేఏసీ అధ్యక్షునిగా రాజమహేంద్రవరపు లక్ష్మణరావులను ఏకగ్రీ వంగా ఎన్నుకొన్నారు.

కొండ్రుప్రోలులో దేవాలయ భూములకు వేలం పాట



కొండ్రుప్రోలు వీరేశ్వరస్వామి వారి ఆలయం వద్ద భూముల వేలం పాట

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొం డ్రుప్రోలు గ్రామంలోని భద్రకాళీ సమేత వీరేశ్వ రస్వామి వారి దేవస్థానం భూములు 12.26 ఎకరాల భూమికి మూడేళ్ల కాలపరిమితికి లీజు వేలం పాట గురువారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఈవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఈ వేలం పాట నిర్వహించారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి వేలం పాటకు హాజర య్యారు. 12.26 ఎకరాల భూమికి గాను రూ.6.08లక్షలు వేలం పాట వెళ్లిందిజ. గతం లో ఈ భూములకు 3.79లక్షలు రాగా, ప్రస్తుతం రూ.6.08లక్షలు లభించింది. గతం తో పోల్చుకుంటే 2.29లక్షలు అదనంగా ఆదాయం సమకూరిందని ఇన్‌చార్జ్ ఈవో చం ద్రశేఖర్ తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



ఇరగవరం భవిత కేంద్రం విద్యార్థికి వీల్‌ఛైర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

ఇరగవరం: మధ్యాహ్న భోజన పథకాన్ని రుచిగా, శుచిగా తయారు చేసి విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఎండీఎం నిర్వాహ కులదేనని ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ తెలి పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రుచిగా, శుచిగా తయారు చేసి విద్యార్థులకు అందిం చాల్సిన బాధ్యత ఎండీఎం నిర్వాహకులదేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో మురళి, మండల విద్యాశాఖాధికారి 1 శ్రీనివాసరావు ప్రసాదరావు, తహసీల్దార్ సుందరరాజు, ,ప్రధానోపాధ్యాయులు, ఎ .నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలన అంతా మోసం

- సంక్షేమం పక్కదారి
- అధికారం కోసం సూపర్ సిక్స్ వాగ్దానాలు
- ఉద్యోగులను నిరుద్యోగులుగా మార్చిన వైనం..
- రోడ్డున పడ్డ వలంటీర్లు.. ఎండీయూ ఆపరేటర్లు.. మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు..
- ఏడాది గడిచినా జాబ్ క్యాలెండరు, నిరుద్యోగభృతి లేదంటూ విమర్శలు..
- ఏరు దాటాక తెప్ప తగలేసిన మాదిరిగా నేటి ప్రభుత్వం



తణుకులో వలంటీర్లను సత్కరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి (ఫైల్)



దువ్వలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ అందిస్తున్న దృశ్యం (ఫైల్)

తణుకు అర్బన్: జాబ్ క్యాలెండరు ఇస్తాం.. నిరుద్యో గులకు నిరుద్యోగభృతి ఇస్తాం.. అంటూ ఎన్నికల ముందు ఢంకాలు మోగించి చెప్పి నేడు ఉపాధి పొందుతున్న వారికి ఊస్టింగ్ ఇచ్చి నిరుద్యోగులుగా మార్చేశారనే విమర్శలు మూటగట్టుకుంది నేటి కూటమి ప్రభుత్వం. ప్రభుత్వం ఏర్పడగానే గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థకు అను సంధానంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వార ధుల్లా పనిచేసి ప్రజలకు సత్వర సేవలందించిన వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడారు. అనంతరం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉద్యోగులు, తాజాగా ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యం అందజేసే ఎం డీయూ వాహనాల ఆపరేటర్లను తొలగించి కూటమి ప్రభుత్వం ఉపాధిని ఎండగట్టిందని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయ్యేసరికి నేడు రేషన్ బియ్యం కోసం దుకాణాల వద్ద ప్రజానీకం క్యూలో నిల్చుం టుండగా, అవసరమైన ధ్రువపత్రాలు ఇతర సమస్యలపై ఆయా కార్యాలయాల చుట్టూ తిరగ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతమెంతో ఘనంగా..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లపాటు వలంటీర్లు ఇంటి గడపలోకి వెళ్లి వారికి అందాల్సిన సంక్షే మాన్ని వివరించి మంజూరయ్యేలా చేసి ప్రజల మన్ననలు పొందారు. 50 ఇళ్లకు ఒక వలంటీరు ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందజే యాలనే ఆదేశాలతో ప్రతి ఇంటికి వలంటీర్లు సేవలందించారు. ప్రజానీకం ఏ కార్యాలయానికి తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటినుంచే పథకాలు పొందే విధంగా ప్రక్షాళన చేశారు. దీం తో పాటు యువతకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటుచేసి వాటిలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్స్‌ల పేరుతో ఉద్యోగాలు కల్పించారు. రాత్రి సమయంలో దుకాణాల వద్ద కాపలా ఉండే విధంగా దుకాణా నికి ఒక్క వాచ్‌మెన్‌ను కూడా ఏర్పాటుచేశారు. ఇక రేషన్ బియ్యం కోసం ప్రజానీకాన్ని రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలో నిల్చునే పరిస్థితులను తప్పించి ఎండీయూ వాహనాలను ఏర్పాటుచేసి ఒక ఆపరేటరు, అసిస్టెంట్‌లను ఏర్పాటుచేసి వారికి కూడా ఉపాధి కల్పించారు. ఇలా ప్రజలకు సత్వర సేవలందించే కార్యాచరణ తోపాటు అదే సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంతో ఇటు ప్రజానీకం, అటు నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

తణుకు నియోజకవర్గంలో..

గత జగన్ ప్రభుత్వ హయాంలో నిరంతర సత్వర సేవలందించిన వ్యవస్థలకు సంబంధించి ఉపాధి పొందుతున్న ఉద్యోగులను కూటమి ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. తణుకు నియోజకవ ర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగ వరం మండలాలకు సంబంధించి సచివాలయాల ద్వారా ఇంటి గుమ్మంలోకి వెళ్లి సేవలందించిన 1050 మంది వలంటీర్లతోపాటు తణుకు ఎక్సైజ్ శాఖ పరిధిలోని 35 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధుల్లో ఉండే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్స్, వాచ్‌మె న్‌లు 145 మంది, ఇంటి గడపలోకి వెళ్లి రేషన్ బియ్యం, సరుకులు అందచేసిన ఎండీయూ వాహన ఆపరేటర్లు 110 మందిని ఉద్యోగాల నుంచి తొలగించిన కూటమి ప్రభుత్వం వారి జీవనోపాధికి భంగం కలిగించింది.

కూటమి మా పొట్టకొట్టింది



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సుమారుగా ఐదున్నరేళ్లు ఎం డీయూ వాహనాల ఆపరేటర్లుగా విధుల్లో ఉంటూ ప్రజలకు రేషన్ బియ్యం ఇంటిముందుకే అందచేశాం. కానీ నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసి మా పొట్టకొట్టారు. వాహన ఆపరేటరుతోపాటు ఒక అసిస్టెంట్ కూడా ఉపాధి పొందే అవకాశాన్ని నేటి కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా తొలగించింది.

– గెల్లా జగన్, ఎండీయూ వాహన అసోసియేషన్ తణుకు మండల ఉపాధ్యక్షుడు

అన్యాయంగా తొలగించారు



గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో పాటు దానికి అనుసంధానంగా పనిచేసే విధంగా వలంటీరు వ్యవ స్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. వలంటీర్లు అందరూ జీతం కోసం కాకుండా సేవాదృక్పథంతో పనిచేసేందుకు చాలా కష్టపడి పనిచేశారు. మా పరిధిలోని ప్రజల ఆప్యాయతతో పలకరింపులు, అభి మానంగా చూసిన రోజులను మరచిపోలేకపోతున్నాం. వృద్ధులకు సేవలందించామనే తృప్తి మాకు కలిగింది. నేటి కూటమి ప్రభుత్వం రాగానే మమ్మల్ని అన్యాయంగా తొలగించింది.

– దాసి రత్నరాజు, వలంటీరు, తణుకు

అత్యుత్తమ సేవలకు మంగళం..



ప్రజలకు సత్వర సేవలందించాలనే తపనతో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమం త్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన వ్యవ స్థలు వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు, మద్యం దుకాణాల్లో ఉద్యోగులను తొలగించి కూటమి ప్రభుత్వం అత్యుత్తమ సేవలకు మంగళం పాడింది. ముఖ్యంగా వలంటీర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్ల వ్యవస్థలను ప్రజలు ఆదరించారు. మిగిలిన రాష్ట్రాల్లో సైతం ఏపీ విధానాలను ఆదర్శంగా తీసుకున్నారు.

– జంగం ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు

విద్యార్థులు క్రమంతప్పకుండా పాఠశాలకు రావాలి



అత్తిలి ఎంపీయూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపా యాలను సద్వినియోగం చేసుకుని, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని మండల విద్యా శాఖాధికారి ఎం కేశవ ప్రసాద్ కోరారు. గురువారం అత్తిలి ఎంపీయూపీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ ప్రారంభించారు. ఈసందర్భం గా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు బ్యాగ్‌లు, షూలు అందజే స్తున్నామన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ టి హేమంత్ ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయిని బి లక్ష్మీసుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 33/11కేవీ కొం డయ్య చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొం డయ్య చెరువు ఫీడర్‌కు సంబంధించి ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్‌లు మర మ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. ఫీడర్ పరిధిలో హంగ్రీబర్డ్ ఏరియా, రమాదేవి ఆసుపత్రి ఏరియా, ఉమన్స్ కళాశాల ఏరియా, కొండయ్య చెరువు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రాథమిక విద్యతో బంగారు భవిష్యత్



పెదతాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పూర్వ ప్రాథమిక విద్యతో చిన్నారులకు మంచి భవిష్యత్ ఉంటుందని పం చాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర అన్నారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి అంగ న్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పం చాయతీ కార్యదర్శి రవిచంద్ర మాట్లాడుతూ మూడేళ్ల పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేం ద్రాల్లో చేర్పించడం ద్వారా పాఠశాలలు అలవాటు అవుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపా టలతో కూడిన విద్యను అందించడంతో విద్య పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాల న్నారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యా ధికారి శ్రీహర్ష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, మాధవరం నెం.4 అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి పాల్గొని అంగన్ వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరా చేస్తుందన్నారు. తద్వారా చిన్నారులు బలవర్ధకంగా ఎదుగుతారన్నారు. మాజీ సర్పంచ్ కవులూరి పరిమళ, జనసేన మం డల మహిళా అధ్యక్షురాలు గరగ విష్ణుప్రియ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లం వీరయ్య, అంగన్‌వాడీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. జగన్నాథపురంలోనూ అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, మహిళా సంర క్షన కార్యదర్శులు సీహెచ్. రజనీకుమారి, బి. అరు ణాదేవి, కార్యకర్తలు ఎ. తులసీరాణి, కే.గీత, పి. అంజికుమారి, టి.రామలక్ష్మి, ఎం. శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం



33వార్డులో చిన్నారులతో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి సెలవులు అనం తరం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠ శాలలు తెరిచారు. తొలి రోజు కావడంతో హాజరు శాతం తగ్గింది. స్థానిక 33వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పిల్లలకు అక్షరాభ్యాస కార్య క్రమం నిర్వహించారు. చిన్నారులతో అక్షరాలను దిద్దించారు. వక్తలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేం ద్రాలను తల్లిదండ్రులు ఉపయోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎన్.ఎం చినపాప, కె.దుర్గ, వి.నాగమణి, జి.రామతులసి, పడాల శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారావుపేట కేంద్రంలో అభ్యరాభ్యాసాలు

భవిత సెంటర్‌లో...

స్థానిక సుబ్బారావుపేట ఐదోవార్డు అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పలకలు, విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, భవిత ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, రత్నకుమారి, నాగలక్ష్మి, అనిల్ కుమార్, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు



పట్టణంలో నిరసన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కుకు కార్మికుల పోరాటానికి మద్దతుగా తాడేపల్లిగూడెం పట్టణంలో గురువారం ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు 0డి.సోమసుందర్ మాట్లాడుతూ కార్మికులు సాగి స్తున్న పోరాటాలు విజయవంతం అయ్యే వరకు కార్మికవర్గం అండగా ఉంటుందని తెలిపారు. ఏఐటీ యూసీ జనరల్ కౌన్సిల్ పిలుపు మేరకు దేశ వ్యాప్త సంఘీభావ దినం పాటిస్తున్నట్లు చెప్పారు. ఉక్కు పరిశ్రమ నుంచి తొలగించిన సిబ్బందిని తిరిగి విధుల్లో తీసుకోవాలని, కార్మికుల జీతం బకాయి లను చెల్లించాలని, విశాఖ ఉక్కుకు సొంతగనిని కేటాయించాలని, నిజమైన పెట్టుబడి పెట్టాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రయివేటీకరణ విధానాలను విడనాడాలన్నారు. విశాఖ ఉక్కును ఒక పథకం ప్రకారం కార్పొరేట్లుకు కట్టబెట్టేందుకు పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక సంఘాలు చేస్తున్న ప్రతిపాదనలను ప్రభుత్వం పెడచెవిని పెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ అనుబంధ సంఘాల కార్యక ర్తలు పెద్ద సంఖ్యలో హాజరైయారు. జూలై 9వ తేదీన కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సార్వత్రిక సమ్మె ఉంటుందని, విజయవంతం చేయాలన్నారు. ఏరియా కమిటీ అధ్యక్షులు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీష్, కార్యనిర్వాహక అధ్యక్షులు కళింగ లక్ష్మణరావులు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాడికొండ శ్రీని వాసరావు, వివిధ సంఘాల నాయకులు పోలిరాతి ఆదినారాయణ, పడాల శ్రీనివాస్, అత్తిలి బాబి, అంకం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



పట్టణంలో డీవైఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఏ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం చెబు తుంటే కార్పొరేట్ సంస్థల అధిపతులు సీట్లు ఇవ్వ డానికి అనేక ఆంక్షలు విధిస్తున్నారని, అటువంటి విద్యా సంస్థలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసి యేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్ప లస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం డీవైఈఓ ధర్మేంద్రకు నాయకులు వినతిపత్రం సమ ర్పించారు. వక్తలు మాట్లాడుతూ విద్యా సంస్థలలో విద్య వాపారంగా మారిందని దీనిలో భాగంగా పుస్తకాలు కూడా విచ్చలవిడిగా అమ్ముతున్నారని వీటిపై చర్యలు తప్పక తీసుకోవాలన్నారు. అధికా రులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సం ఘాలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. యశ్వంత్, అనీల్, రాజు, భార్గవ్, సాయి పాల్గొన్నారు.

చెత్తతో స్వాగతం పలుకుతున్న పల్లెసీమలు



కాళ్ల డంపింగ్ యార్డును ఆనుకుని వేసిన చెత్తల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు



నిరుపయోగంగా ఉన్న కాళ్ల డంపింగ్ యార్డ్

- గ్రామాల్లోని రహదారుల వెంట పేరుకుపోతున్న చెత్త
- డంపింగ్ యార్డులకు చేరని వైనం

కాళ్ల: గ్రామీణ ప్రాంతాలు అనగానే పచ్చని పల్లెలు, ఆహ్లాద వాతావరణం గుర్తుకు వస్తాయి. కానీ గ్రామాల్లో అటువంటి ఆహ్లాదం, పచ్చని వాతావరణం కనిపించకుండా పోతుంది. నియో జకవర్గంలో అన్ని మండలాల్లోనూ కొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మండలంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త దర్శనం ఇస్తుంది. డంపింగ్ యార్డులు ఉన్నా అవి అలంకార ప్రాయంగానే మిగిలిపోతు న్నాయి. మండలంలో వేంపాడు, కోలనపల్లి, కాళ్లకురుతో పాటు మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో రహదారుల పక్కనే వ్యర్థ పదార్థా లను, చెత్తను నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. దీంతో గ్రామంలోకి వచ్చే వారికి దుర్వాసనతో చెత్తతో స్వాగతం పలుకుతున్నాయి. దుర్వాసన వస్తుం దని దీనివల్ల వ్యాధులు బారిన పడతామని స్థాని కులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. సంపద సృష్టించే కేంద్రాలకు తరలించా ల్సిన చెత్తను రోడ్డు పక్కన వేసి తగలబెట్టడంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారుతు న్నాయి.

నిలువెత్తు నిర్లక్ష్యం

కాళ్ల మండలం వేంపాడు గ్రామ పరిధిలో ప్రారం భంలోనే గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్డు ఆనుకుని చెత్తను వేస్తున్నారు. అధికారులు రోడ్ల పక్కన చెత్త వేయరాదని బోర్డులు ఏర్పాటు చేసినా నిర్లక్ష్యంగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు రోడ్డు పక్కన పారేస్తున్నారు. అంతే కాకుండా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో ఉన్న సంపద సృష్టి కేం ద్రానికి ఆనుకుని చెత్తను వేయడంతో ఆ చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆవులు తింటున్నాయంటే పరిస్థితి ఎలాం ఉందో అర్థం చేసుకోవచ్చు. అం తేకాకుండా గ్రామంలో ప్రధాన రహదారి ఆనుకుని మురుగునీరు నిల్వ ఉన్న దోమలు ప్రబలుతున్న దుర్వాసన వస్తున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదని పలువురు ఆరోపిస్తు న్నారు. రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో తరచుగా చెత్తతో ఉన్న దృశ్యాలు కనిపి స్తూనే ఉంటాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు ఇళ్లల్లో వాడు కునే వ్యర్థ పదార్థాలు తోపాటు ఆఖరికి దుస్తులు పరుపులు లాంటివి కూడా నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే పడేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ప్రజలకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు. అధి కారులు స్పందించి రహదారులు వెంబడి వ్యర్థ పదార్థాలు చెత్తాచెదారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాణసంచా పేలి వ్యక్తికి గాయాలు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దిరు సుమర్రు గ్రామానికి చెందిన మేడిది బుడ్డియ్య తన చెరువు వద్ద పక్షులను బెదిరించేందుకు మం దుగుండు సామాను వేరే ప్రాంతం నుంచి తీసుకు రాగ గురువారం ప్రమాదవ శాత్తు పేలి గాయాల పాలయ్యాడు. స్థానకులు స్పందించి బుడ్డియ్యను చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రైవేటు ఆస్ప త్రికి తరలించారు.

శిశు మరణాలను తగ్గించాలి

పాలకోడేరు: శిశు మరణాలను తగ్గించేందుకు అవ సరమైన సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు గర్భి ణులకు చెబుతూ ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ గీతాబాయి పేర్కొన్నారు. గురువారం ఆమె శృంగ వృక్షం గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ గర్భిణుల్లో, బాలింతల్లో, కిశోర బాలికల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రజుమంలో సీనియర్ వైద్యా ధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ ఉన్నారు.

సంక్షేమంలో కూటమి ప్రభుత్వం విఫలం



అర్థమూరులో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రావు

ఉండి: ప్రజలకు సం క్షేమం అందజేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంక ట్రావు అన్నారు. గురు వారం మండలంలోని అర్థమూరులో నిర్వహిం చిన సమావేశంలో ఉండి వీరభద్రరావును శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశం లో వెంకట్రావు మాట్లాడుతూ అధికారం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు ఇచ్చేసి ఆపై అధికారం రాగానే కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా మేము అధికారంలోకి వస్తే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటిస్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని అన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి సూప ర్‌గా ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. ప్రజలకిచ్చిన మాటను మర్చి పోతే నాయకులకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అర్థమూరు గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు తీరని ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కోనా గొల్లయ్య, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.